ప్రజలకు పీకల్లోతు కష్టాలు

- పీకల వాగుకి రెండు వైపులా వేలాది కుటుంబాలు జీవనం
- కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన రక్షణ గోడలు
- గతంలో ప్రమాదవశాత్తు పడి పలువురు మృత్యువాత
- ఏళ్లు గడిచినా మారని రూపురేఖలు..
- పట్టీపట్టనట్లుగా పాలకులు, అధికారులు


వాగు కింద నిలిచిపోతున్న చెత్త చెదారం, వ్యర్థాలు

నగరంపాలెం: వర్షాకాలం వచ్చేస్తోంది.. నగరంలో రోడ్లు జలమయం అవుతున్నాయి.. ఆ నీరు ప్రవహించే కాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఆక్రమణలతో కుదించుకుపోతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా నగరం వాగులను తలపిస్తోంది. నగరంలో ప్రధానంగా ఓ వాగు డ్రెయిన్‌ను తరలించేందుకు ఆధారం. ఏళ్ల గడిచినా దాని ప్రక్షాళన ఊసే లేదు. అదే పీకుల వాగు. ప్రస్తుతం చుట్టూ వేలాది నివాస గృహాల మధ్య నుంచి ఏటుకూరు వరకు వెళ్తోంది. భారీ వర్షం వస్తే మాత్రం వాగు ఉప్పొంగుతోంది. రక్షణ గోడలు లేవు. వర్షపు, మురుగునీరు ఏకమై ఇళ్లల్లోకి చేరతాయి.

ఇదీ వాగు పరిస్థితి..

నగరంలోని లక్ష్మీపురం శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వద్ద పీకలవాగు మొదలై.. దేవాపురం, కోబాల్టుపేట, బ్రాడీపేట, ఏటీ అగ్రహారం, చుట్టుగుంట, మెడికల్ క్లబ్ రోడ్డుతో పాటు ఏటుకూర్ రోడ్డు చివరి వరకు ప్రవహిస్తోంది. సుమారు తొమ్మిది డివిజన్ల పరిధి నుంచి వెళ్తోంది. దీని చుట్టు వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. 24 ఏళ్ల క్రితం అప్పటి నగర కమిషనర్ ఎంటీ కృష్ణబాబు ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. కోబాల్టుపేట ఏడో వీధి మీదగా వెళ్లే వాగులో తొమ్మిది అడుగుల మేర లోతున కాంక్రీటు పనులు చేపట్టారు. అలాగే వాగుకి రెండు వైపులా వాహనాలు వెళ్లేందుకు ఇళ్లను కొంతమేర తొలగించారు. పనులు జరిగే క్రమంలో కమిషనర్ కృష్ణబాబు బదిలీయ్యారు. దీంతో అభివృద్ధి పనులు అర్ధాంతంగా నిలిచాయి.

దుర్వాసనతో..

వేలాది నివాసాల మధ్య దుర్వాసనతో ప్రవహించే వాగుని అభివృద్ధి చేయాలనే ఆలోచన పాలకులు, అధికారులకు ఏమాత్రం లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్న వారే కరువయ్యారు. ఆఖరికి అందులోని పూడికతీత పనులే మొక్కుబడిగా జరుగుతాయి. ఒకవేళ చెత్తచెదారం తొలగించిన, రహదారులపై పడవేసి రోజులు గడిచిన తొలగించే పరిస్థితి ఉండదు.. ప్రమాదవశాత్తు ఎవరైనా అందులో పడి చనిపోతే ఒకట్రెండు వారాలు హడావుడి, తర్వాత మామూలే.. చిన్నారులు, పెద్ద వారు సైతం మృత్యువాతకు గురైయ్యారు. అయితే దేవాపురం, కోబాల్టుపేటలో వాగు శిథిలావస్థలోకి చేరింది. సరైన గోడల్లేవు. ఒకవేళ ఉన్న శిథిలావస్థకు చేరాయి. దేవాపురం మూడో వీధిలో ఇల్లు కోతకు గురైంది. వాహనాలపై, నడిచి వాగు దాటాలంటే భయమేస్తోందని ఆ ప్రాంత వాసులు వాపోయారు. వర్షకాలమైతే భయంగా ఉంటుందని చెప్పారు.


దేవాపురం మూడో వీధిలో పీకలవాగుకి ఒకవైపు గోడలేక కూలిన ఇల్లు


దేవాపురం ఐదో వీధిలో వాగుకి రెండు వైపులా సరిగ్గా లేని గోడలు

ఇనుప కంచె ఏర్పాటు చేయాలి



ప్రధానమైన పీకల వాగు ఇరువైపులా పది అడుగుల ఎత్తులో ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. ఇళ్లల్లో నుంచి వ్యర్థాలు, ఇతరత్రా వాటిని వేయకుండా ఉండేందుకు స్థానికులకు అవగాహన కల్పించాలి. అవసరమైతే స్థానికులకు జరిమానా విధించాలి. పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలి. ఒకవేళ తొలగించిన చెత్తను యుద్ధప్రాతిపదికన రహదారులపై నుంచి తొలగిస్తే, వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవకాశాలున్నాయి.

– పిల్లి బాబూరావు, స్థానికుడు, దేవాపురం

వ్యర్థాలకు నిలయంగా..

వాగు పూడికతీత పనులు పట్టించుకోవడం లేదు. నెలలు గడిచిన కొద్ది అందులోని చెత్తచెదారం, ఇతరత్రా వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో చెత్త నిలిచిపోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. అక్కడే ఉండిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు తెలిపారు. కొందరు స్థానికులు ఇళ్లల్లోని చెత్త, దిండ్లు, బెడ్‌షీట్‌లు, పరుపులు, భోజనపు ప్లేట్‌లు విసిరివేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. అశోక్ నగర్, దేవాపురం, పండరీపురం తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

23వ రోజుకి చేరిన సీహెచ్‌ఓల సమ్మె



లక్ష్మీపురం: వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎంలో ఆరు సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారంతో 23వ రోజుకు చేరింది. గుంటూరు జిల్లా ఏపీఎంసీఏ ప్రెసిడెంట్ టి.ప్రవల్లిక, ట్రెజర్ కె.సంధ్య సమ్మెలో పాల్గొని మాట్లాడారు. గత 23 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న సిబ్బంది న్యాయపరమైన డిమాండ్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్, పెండింగ్ ఇన్‌సెంటివ్స్ వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు.

నీలం సంజీవరెడ్డి, ప్రకాశం పంతులుకు ఘన నివాళి

లక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి తరువాత కూడా తమ జీవితాల్ని ప్రజాసేవకు అంకితం చేసిన వారిలో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ముందు వరుసలో ఉంటారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విద్యావేత్త విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య అన్నారు. గుంటూరు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం నీలం సంజీవరెడ్డి జయంతి, టంగుటూరి ప్రకాశం వర్ధంతి నిర్వహించారు.

అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం మహాభారతంలోని అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు గుదిమెళ్ల కూర్మనాథస్వామి మాట్లాడుతూ మహాభారతం ప్రకారం కలి ఒక దుష్టదేవత అని, పూర్వీకులైన కశ్యపముని పదిహేనవ కుమారునిగా జన్మించాడని అన్నారు. కలియుగ ప్రభువుగా కలి తన ప్రభావాన్ని పాపపు చర్యలను ప్రోత్సహించేందుకు రాజు పరిక్షిత్తు మహారాజుని అడిగాడని అన్నారు. వర సహాయంతో జూదం, మద్యపానం, వ్యభిచారం, హత్య, బంగారమనే ఐదు వ్యసనాలకు లోబడి ప్రజలను ఆవహించి వారిని పతనం చేస్తాడని పేర్కొన్నారు. ఆయన కథనంలో ఆయన చేత పీడించి, హింసించబడిన నలమహారాజు లాంటి వ్యక్తులతో ముడిపడి ఉందని అన్నారు.

మహిళలకు భరోసా, భద్రత కల్పించడమే లక్ష్యం

నెహ్రూనగర్: రాష్ట్రంలో దాడులకు, అన్యాయానికి గురైన మహిళలకు భరోసా, భద్రత కల్పించి వారికి న్యాయం చేయటమే రాష్ట్ర మహిళా కమిషన్ ప్రధాన అజెండా అని, దానిలో భాగంగా దాడులకు గురైన బాధితులకు వసతి కల్పిస్తున్న శక్తి సదన్‌లు పరిశీలిస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. బుధవారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ గుంటూరు మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్, ఒన్ స్టాప్ సెంటరును సందర్శించారు. శక్తి సదన్‌లో వసతి పొందుతున్న మహిళలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ బి.వసంత బాలా, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, మహిళా ప్రాంగణం మేనేజరు రమణశ్రీ, ఏడీ నిర్మల పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం



నగరంపాలెం: స్థానిక పాతగుంటూరు మెయిన్ రోడ్డులోని విశాఖ శారదాపీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో జయంతి ఉత్సవాలు బుధవారం నాలుగో రోజుకు చేరాయి. స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించగా, గణపతి హోమం, లక్ష్మీనారాయణ హోమం, ఆంజనేయ హోమం, సుదర్శన హోమం, సుందరకాండ హోమం చేపట్టారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, పెళ్లి కుమారుని చేయడం వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివ రావు, సభ్యులు ఆత్మకూరి లక్ష్మణ రావు, సురేంద్ర కుమార్, తవ్వా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారులకు కనువిప్పు



నెహ్రూ నగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన తర్వాత హడావుడిగా వార్డు సచివాలయాల బయట ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటం సచివాలయం బయట బోర్డుకు ఉందనే కారణంతో 91వ వార్డు అడ్మిన్ సెక్రెటరీని సస్పెండ్ చేస్తూ నగర కమిషనర్ శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే బుధవారం మధ్యాహ్నం సచివాలయాల వద్ద ప్రత్యేకంగా బోర్డులు వెలిశాయి. అధికారులు తప్పిదం పెట్టుకొని సెక్రటరీని సస్పెండ్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ బుధవారం అడ్మిన్ సెక్రటరీల అసోసియేషన్ నాయకులు నగర మేయర్‌ను కలిశారు. సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ కోరారు.

డీఎస్సీకి ఏకాగ్రత, పట్టుదలతో సన్నద్ధం కావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్, టీచర్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎడ్యుకేషనల్ సైకాలజీ మెటీరియల్‌తో కూడిన పుస్తకాలను డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ప్రైవేటు ఉపాధ్యాయులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డీఎస్సీకి పోటీ తీవ్రంగా ఉందని, ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు శ్రమించాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా క్రమపద్ధతిలో చదివితే అనుకున్న విధంగా విజయం సాధించగలరని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమం కోసం పని చేస్తున్న ఎస్పీఎల్‌టీఓ అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్యను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.రాకేష్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.రాము పాల్గొన్నారు.

మూడు వంతెనల వద్ద డ్రెయినేజీ సమస్య లేకుండా చర్యలు

మేయర్ రవీంద్ర


మూడు వంతెనల వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరంలోని మూడు వంతెనల దగ్గర డ్రెయినేజీ సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలసి వంతెనల దగ్గర పర్యటించి వర్షం నీరు నిలబడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్వోబీ తరువాత గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలకు అతి ముఖ్యమైన వారధిగా మూడు వంతెనల మార్గం ఉందని, త్వరలో ఆర్వోబీ పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ మళ్లింపుకు కూడా ఇదే ప్రధాన మార్గం అవుతుందని చెప్పారు. అటువంటి కీలకమైన ప్రాంతంలో రోడ్ల విస్తరణకు స్థల సేకరణ చేయడం జరిగిందన్నారు. కాని చిన్నపాటి వర్షానికి కూడా ఈ ప్రాంతం బురద చేరుకోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే మురుగు నిలవకుండా డ్రెయిన్ నిర్మాణం చేయాలని, స్థల సేకరణ జరిగిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అవుట్ ఫాల్ డ్రెయిన్ బయటకు వెళ్లే మార్గం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న డ్రెయిన్లు, కల్వర్టుల వద్ద సిల్ట్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు హనీఫ్, నాగభూషణం పాల్గొన్నారు.

దివంగత రాజీవ్ గాంధీకి ఘన నివాళి


రాజీవ్ గాంధి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

లక్ష్మీపురం: అతి పిన్న వయసులోనే ప్రధాన మంత్రి పదవిని అధిష్టించిన రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్‌కు బాటలు వేశారని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, గుజరాత్ రాష్ట్ర ఇన్‌చార్జి ఉషారాణి, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధి వర్ధంతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయమ్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బి.సునీల్, నాగేశ్వరరావు, జె.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కరీం, తిరుమలరావు, ఖాదర్ వలి బాషా, కొండయ్య పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తి పై కేసు

లక్ష్మీపురం: ఓ కుటుంబాన్ని ఉద్దేశ పూర్వకంగా భయబ్రాంతులకు గురి చేస్తు వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు సాయినగర్ 4వ లైన్ నల్లపాడు రోడ్డు, మిర్చి యార్డు ప్రాంతానికి చెందిన శ్రీపాద సుబ్రహ్మణ్యం, ఇంటి ముందు చిన్న అనే వ్యక్తి డీజే పెడుతూ ఇంటి ప్రహరీపై మద్య తాగుతూ దుర్భషలాడుతు వేధింపులకు గురిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు మంగళవారం అర్ధరాత్రి వెళ్లి చిన్న అనే వ్యక్తిని అదుపులో తీసుకుని, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యాధికారులకు శిక్షణ



గుంటూరు మెడికల్: స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం పీహెచ్, యూపీహెచ్, తదితర ఆస్పత్రుల్లో పనిచేసే వైద్య అధికారులకు రొటీన్ ఇమ్యూ నైజేషన్ నూతన మ్యాన్యువల్ 024–25పై నిర్వహించిన మూడురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో టీకాల కార్యక్రమం సమర్థంగా ఏ ఒక్క గర్భిణి, బాలింత బిడ్డ, మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ద్వారా హెడ్ కౌంట్ సర్వే నిర్వహించాలని కోరారు. పటిష్ట ప్రణాళిక రూపొందించి, సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు చేయాలన్నారు. సర్వేలెన్స్ వైద్య అధికారి డాక్టర్ ఎ.భవానీ, యూఎన్‌డీపీ ప్రోగ్రాం అధికారి ఎం.మధుకరరావు ప్రాధాన్యాన్ని వివరించారు.

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో ఆకు పూజ

నగర పుర వీధుల్లో వైభవంగా గ్రామోత్సవం


భక్తుల కోలాటం


తమలపాకుల పూజకు హాజరైన భక్తులు

నగరంపాలెం: స్థానిక కొత్తపేట(నాజ్ కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి హనుమత్ జయంత్సుత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం పంచామృత స్నపన, అనంతరం స్వామికి లక్ష తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం చేపట్టారు. కనక తప్పెట్లు, మంగళ వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలు అలరించాయి. చిన్నారులు, మహిళా భక్తుల కోలాటం మరింతగా ఉత్తేజపరిచాయి. భక్తి గీతాలు ఆలపించారు. 108 మహిళలతో దీపాలంకరణలులతో వైభవంగా స్వామి గ్రామోత్సవం కొనసాగింది. నాజ్ కూడలి, కొత్తపేట తదితర ప్రాంతాల మీదగా గ్రామోత్సవం కొనసాగగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. విద్యుద్దీపాలంకరణతో దేవాలయాన్ని అలకరించారు. కార్యక్రమంలో శ్రీ హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువళ్ళూరు వెంకటసుబ్బారావు, దేవస్థానం ఈఓ టి.సుభద్ర, సమాజం సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకట రమణ, మారుతి, సుబ్రహ్మణ్యం, బాపిరాజు పాల్గొన్నారు.

భారత్ అంశాల్లో అమెరికా జోక్యం తగదు


మాట్లాడుతున్న ఎస్.కృష్ణారావు

లక్ష్మీపురం: భారత దేశ భవిష్యత్ ప్రభావితం చేసే అంశాలపై అమెరికా అధ్యక్షుడు పదే పదే జోక్యం చేసుకోవడం ఆందోళకరమని అమెరికా ఏక పక్ష విధానాలను భారత్ ధైర్యంగా ఎదుర్కోవాలని జీవన సంధ్య అధ్యక్షుడు ఎస్.కృష్ణారావు అన్నారు. గుంటూరు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశ అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవడం దేశ సార్వభౌమాధికారాన్నే సవాల్ చేస్తూ మాట్లాడుతున్న తీరుకి చెక్ పెట్టడానికి బదులు కనీసం నోరు మెదపటానికి కూడా కేంద్రంలోని పెద్దలు ఇష్టపడక పోవడం అగ్రరాజ్యానికి జీ హుజూర్ అనటమే అన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత అధికారి వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్ ప్రయోజనాలకు నష్టం చేసేలా ఉన్నాయన్నారు.

ఉగ్రవాద దాడి ఆటవిక చర్య

ఉగ్రవాద మూకల దాడి ఆటవిక చర్య అని ఆర్టీసీ విశ్రాంత అధికారి ఎల్.మురళీకృష్ణ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'భారతదేశానికి విషమ సమస్యగా మారిన ఉగ్రవాదం' అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉక్రెయిన్, రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంటే మరో పక్క ఇజ్రాయిల్ హమాస్ దాడులు గాజాను రక్తసిక్తం చేస్తున్నాయన్నారు. పాక్ ప్రేరణతో భారత్‌లో ఉగ్రవాదం ప్రబలి అమాయకులు కాల్చి చంపబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త చంద్రయ్య, విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు ప్రసంగించారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా ఉండాలి

తెనాలి: ప్రజాసమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా వ్యవహరించాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ స్పష్టంగాచేశారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సదస్సుకు సబ్‌కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూ నగర్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు సమస్య లేకుండా నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు నిలిచిన మూడు వంతెనలు, మెడికల్ కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాలలో తక్షణం నీటిని తొలగించారు. బుధవారం రాత్రి కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రిజర్వాయర్ల వారీగా ఇంజినీరింగ్ సిబ్బంది తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా తగు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. నగరంలో హోర్డింగ్స్ ఎక్కడైనా పడితే వెంటనే తొలగించడానికి తగిన సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. నగర ప్రజలు వర్షం వల్ల ఏదైనా సమస్య ఏర్పడితే ఏ సమయంలో అయినా కాల్ చేయడానికి 24 గంటలు పని చేసేలా జీఎంసీ కాల్ సెంటర్ 0863–2345103 ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. వర్షం వల్ల ఏ సమస్య వచ్చినా సంబంధిత విభాగ సచివాలయ కార్యదర్శులు, అధికారులు తక్షణమే స్పందించేలా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.